అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం 13 మే 2023

మల్లారం అడవిలో గుర్తు తెలియని శవం లభ్యం



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రూరల్ మండలం మల్కాపూర్-మల్లారం అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు రూరల్ ఎస్ఐ లింబాద్రి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 11 గంటలకు మల్కాపూర్ -మల్లారం అడవి మధ్యలో రోడ్డు పక్కన చెట్టు కింద అందాజ 45 నుంచి 50 సంవత్సరాలు కలిగిన ఒక గుర్తుతెలియని మగ మనిషి చనిపోయి ఉండగా మల్లారం వీఆర్ఏ రాజు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎవరైనా గుర్తుపట్టినచో తమకు సమాచారం తెలియజేయాలని సూచించారు.

మైనర్ బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ నగరంలోని ఆరో పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాయికుమార్ వివరాల ప్రకారం.. డ్రైవర్స్ కాలనీకి చెందిన తబస్సు కణం (16) ఈ నెల 8వ తేదీనా రాత్రి 8 గంటలకు కాలనీలో గల కిరాణా షాప్‌కు వెళ్లింది. అక్కడ తనకు తెలిసిన అల్తాఫ్ అనే అబ్బాయి కలవడంతో అతనితో బైక్ పై కూర్చున్నది. అది గమనించిన అదే కాలనీకి చెందిన ఆమెర్ అమ్మాయి తల్లిదండ్రులకు చెప్పడంతో అమ్మాయి తల్లిదండ్రులు అమ్మాయిని మందలించారు. అంతేకాకుండా అబ్బాయితో బైక్ పై ఎక్కిన విషయం కాలనీలో తెలిసిందని దాంతో కాలనీ వారు ఏమనుకుంటున్నారో అని మనస్థాపంతో తన ఇంట్లో శుక్రవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ఖరీఫ్‌పై కసరత్తు

5 లక్షల ఎకరాల్లో సాగు అంచనా?

- 4 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 89 వేల మెట్రిక్ టన్నుల యూరియాకు ప్రతిపాదనలు
- ఎరువుల కొరత రాకుండా చర్యలు

: జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

నవతెలంగాణ-నిజామాబాద్‌ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లాలో ఖరీఫ్ సాగు ప్లాన్‌పై వ్యవసాయాధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ సీజన్‌లో సుమారు 5 లక్షలా 13 వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్టు సమాచారం. ఇందులో 4 లక్షలా 17 వేల ఎకరాల్లో వరి పంట సాగవనుంది. వరి తరువాత 58 వేల ఎకరాల్లో సోయాబీన్ సాగవనున్నట్టు అంచనాలు రూపొందించారు. ఈ సీజన్‌లో 89 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవనుంది. ఇప్పటికే వ్యవసాయాధికారులు ప్రాథమికంగా ప్లాన్‌ను ఖరారు చేశారు. అధికారికంగా త్వరలో జిల్లా కలెక్టర్‌తో విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత రానీయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ నవతెలంగాణకు తెలిపారు.

జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రణాళికను ఖరారు చేయడంలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారు. ముందస్తుగా ప్రణాళిక ఖరారు చేసి రైతాంగానికి ఇబ్బందులు రానీయకుండా చర్యలు చేపడుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5,12,738 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ యేడాది ఖరీఫ్-2023 సీజన్‌లో 5,13,000 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశమున్నట్టు అధికారులు అంచనాలు రూపొందించినట్టు తెలిసింది. ఇందులో 4,17,000 ఎకరాల్లో వరి సాగవనుంది. గతేడాది సీజన్‌లో 4,18,079 ఎకరాల్లో వరి పంటసాగయ్యింది. వరి తరువాత సోయాబీన్ 58 వేల ఎకరాలు, మొక్కజొన్న 32,185 ఎకరాలు, పత్తి 1800, కందులు 1800 ఎకరాల్లో సాగయ్యే అవకాశముంది. ఖరీఫ్ సీజన్‌లో 1,25,000 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరంకానున్నాయి. సోయాబీన్ 17,600 క్వింటాళ్ల, మొక్కజొన్న 2,575 క్వింటాళ్ల విత్తనాలు అవసరంకానున్నాయి.

అవసరమయ్యే ఎరువులు (అంచనా)	
యూరియా	89,000
డీఏపీ	21,000
ఎంఓపీ	6,600
కాంప్లెక్స్	32,000

వానాకాలం ప్రణాళిక

	2022లో సాగైన పంటలు	2023లో ప్రతిపాదనలు
వరి	4,18,079	4,17,000
మొక్కజొన్న	32,542	32,000
సోయాబీన్	58,798	58,000
పత్తి	1,974	1800
కందులు	641	1800
పెసర్లు	85	150
మినుములు	35	120
వేరుశనగ	380	200
ఇతరపంటలు	204	300
మొత్తం	5,12,738	5,15,870

లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు

ఈ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత రానీయకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ముందుగానే ఈ సీజన్‌కు సరిపడా ఎరువుల ప్రతిపానదలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనాలు రూపొందించారు. ఇందులో యూరియా 89 వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 21 వేల మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 6,650, కాంప్లెక్స్ 32 వేల మెట్రిక్ టన్నుల అవసరమని అంచనాలు రూపొందించారు. అయితే ఖరీఫ్‌లో రైతులు ఆరుతడి పంటల సాగుకు మొగ్గుచూపాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులకు ఎరువుల కొరత రానీయం

జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత రానీయబోము. జిల్లా రైతాంగానికి అవసరమైన యూరియా ప్రతిపాదనలు ముందుగానే సిద్ధం చేస్తున్నాం. అవసరాన్ని బట్టి జిల్లాకు ఎరువులు తెప్పిస్తాం. పకడ్బందీ ప్రణాళికతో గతేడాది ఇబ్బందులు తలెత్తనీయలేదు. రైతులు విత్తనాలు విత్తుకునేటప్పుడు జాగ్రత్తలు వహించాలి. నైరుతి ఆరంభ సూచికగా వర్షాలు పడే సమయంలో విత్తనాలు విత్తుకోవద్దు. కొన్ని రోజుల తరువాతే విత్తనాలు విత్తుకోవాలి. ఖరీఫ్‌లో ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలి.

అదుపు తప్పి డీసీఎం బోల్తా

- 60 మందికి గాయాలు.. వారిలో 20 మందికి తీవ్ర గాయాలు
- బడాపహాడ్ వెళ్తుండగా అర్ధరాత్రి ఘటన.. ఆస్పత్రికి తరలింపు



డీసీఎం బోల్తా పడటంతో చెల్లాచెదురుగా పడ్డ సామాన్లు..



పోలీస్ వాహనంలో క్షతగాత్రుల తరలింపు

నవతెలంగాణ-వర్ని

నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి వేళ డీసీఎం బోల్తా పడింది. ఈ ఘటనలో 60 మంది గాయపడగా.. వారిలో 20 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్ఐ అనిల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది సకాలంలో స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామనికి చెందిన వారు.. వర్ని మండలంలోని బడాపహాడ్‌కు వెళ్లేందుకు రాత్రి వేళ డీసీఎంలో బయలుదేరారు. అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో డ్రైవర్‌కు నిద్రమత్తు రావడంతో ప్రమాదవశాత్తు డీసీఎం బోల్తా పడింది. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిల్‌రెడ్డి.. పోలీసు సిబ్బందితో కలిసి హుటాహుటిన క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. మూడు మండలాలకు చెందిన పీహెచ్‌సీ అంబులెన్స్‌లలో, ఒక బొలెరో వాహనం, పోలీసు వాహనాల్లో క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సకాలంలో వైద్యం అందేలా చేశారు. 60 మంది గాయపడగా.. వారిలో 20 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి.

ఎస్ఐ సత్వర రెస్పాన్స్‌తో తప్పిన ప్రాణాప్రాయం

ఘటన జరిగిన వెంటనే హుటాహుటిన ఎస్ఐ అనిల్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ప్రమాద ప్రదేశానికి చేరుకున్నారు. బ్యాటరీ లైట్‌ల వెలుగుతో వాహనం కింద, లోపల చిక్కుకున్న వారిని వెంటవెంటనే బయటకు తీసి అంబులెన్స్, ఇతర వాహనాల ద్వారా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి పూర్తిస్థాయి చికిత్స అందే వరకు అక్కడే ఉన్నారు. దీంతో ఎస్ఐ, పోలీసులను స్థానికులు అభినందించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం : మంత్రి వేముల

కంఠేశ్వర్ : బడాపహాడ్ దర్గాకు వెళ్తూ ప్రమాదానికి గురైై నిజామాబాద్ ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాల్కొండ నియోజకవర్గం మానాలా వాసులను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న 28 మంది క్షతగాత్రులకు అందుతున్న చికిత్స గురించి మంత్రి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులో ఉన్న ప్రతి బెడ్ తిరుగుతూ బాధితులకు మంత్రి మనో ధైర్యం చెప్పారు. మీకు ఏమి కానివ్వం,అన్ని విధాల అండగా ఉంటానని భరోసా కల్పించారు. మంత్రి వెంట డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, పోలీసు, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.



ఆస్పత్రిలో పర్యవేక్షిస్తున్న ఎస్ఐ, పోలీసులు



క్షతగాత్రులతో మాట్లాడుతున్న మంత్రి వేముల

సాలూర పీహెచ్‌సీ తనిఖీ చేసిన ఎన్కాస్ బృందం



రికార్డులు తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

నవతెలంగాణ-బోధన్

సాలూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్కాస్ అవార్డుకు ఎంపిక కావడంతో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు ఎన్కాస్ బృంద సభ్యులు డాక్టర్ రోనిత్ బోరు, డాక్టర్ మిథిలేష్ చతుర్వేది ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఆరు విభాగాలను లేబర్ రూమ్, ల్యాబ్ వాటిని పరిశీలించి, రోగుల ద్వారా వైద్య సేవలపై వివరాలు సేకరించారు. వైద్యుల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఆరు విభాగాలకు చెందిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ పరిసరాల శుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తూ మరింత పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. వారి వెంట జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, పీహెచ్ సీ ఇంచార్జి డాక్టర్ సమత, టీబీ సూపర్వైజర్ మంజుల, పిహెచ్ సీ సూపర్వైజర్లు ఇందిరా, సునీత ఉన్నారు.

రూ.3.65 కోట్లతో యానంపల్లిలో పనులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యానంపల్లి గ్రామానికి రూ.3.65 కోట్ల రూపాయలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఇంకా మిగిలిన పనులకు గాను పూర్తి సహాయ సహకారం అందజేస్తానని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 23 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కుల విలువ 23,02,668 లక్షల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ బిజెపి నాయకులు నోరు తెరిస్తే అబద్ధంగా మాట్లాడుతరని, గల్లీలో ఉండే బిజెపి నాయకులు కేంద్రం నుండి రూపాయి తెచ్చే ముఖం లేదు కానీ, ప్రొద్దున లేస్తే గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు, గ్రామాలకు చేసింది ఏమీ లేదని అన్నారు. స్థానికంగా గెలిచిన నిజామాబాద్ ఎంపీ యానం పల్లి గ్రామానికి ఒక్క రూపాయి అయినా ఇచ్చాడా అని ప్రశ్నించారు. ఆ ఎంపీకి ఏడాదికి రూ.5 కోట్ల ఫండ్ వస్తుందని, నాలుగేండ్ల నుంచి ఏ ఒక్క గ్రామానికి అయినా రూపాయి ఇచ్చిన ముఖం లేదని దుయ్యబట్టారు.

మతోన్మాద విధానాలపై నికరంగా పోరాడినప్పుడే
ప్రజాస్వామ్య మనుగడ

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు టి. సాగర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్

మతోన్మాద విధానాలపై నికరంగా పోరాడినప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాగుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ అన్నారు. నగరంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో శుక్రవారం పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు తీగల సాగర్, పాలడుగు భాస్కర్ హాజరై ప్రసంగించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలలో అనైక్యతను సృష్టించి సమస్యలను పక్కనపెట్టి మత ఉద్రిక్తకలను రెచ్చగొట్టి తమ రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు. భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు బీజేపీ పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ భూషణ్ పైన లైంగిక ఆరోపణలు వస్తున్నప్పటికీ ఆయన పైన ఎటువంటి చర్యలు తీసుకోకపోగా తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతిపక్ష పార్టీల నాయకులను లోబర్చుకోవటానికి ఈడీ దాడులు, ఐటీ దాడులు, సిబిఐ దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేసి తనకు వ్యతిరేకంగా మాట్లాడకుండా చేస్తున్నారని అన్నారు.

బిజెపి అనుసరించే ప్రజావ్యతిరేక మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించటానికి పార్టీ సర్వశక్తులు ఒడ్డాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ రమ, జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్రాములు, నూర్జహాన్ కామారెడ్డి జిల్లా నాయకులు మోతిరామ్, సురేష్‌గుండా, జిల్లా కమిటీ సభ్యులు పిసూరి, సుజాత, అనిల్, మహేష్ తదితరులతో పాటు పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లకు నోటీస్ ఉపసంహరించుకోవాలి

- వారి సమస్యలను పరిష్కరించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

యూనియన్ పెట్టుకున్నందుకు సమ్మె చేస్తున్నందుకు జేపీఎస్‌లను తొలగిస్తామని ప్రభుత్వం ఇచ్చిన నోటీసు ఉపసంహరించుకోవాలని వారి సమస్యను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి జేపీఎస్‌లతో మాట్లాడారు. జేపీఎస్‌ల సమ్మెకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ అండగా ఉందని అన్నారు.

వివరాలు మెయిన్‌లో..

కొనుగోలు కేంద్రాలకు
లారీలు తరలించేందుకు తనిఖీలు

- అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీలను పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-బిచ్కుంద

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత ఉండడంతో తూకంవేసిన ధాన్యం ఎక్కడికక్కడ నిల్వ ఉంటుంది. దీనికి తోడు మిల్లులకు ధాన్యాన్ని తరలించినప్పుడు వారం రోజులైనా అన్‌లోడ్ చేసుకోకపోవడంతో లారీలు మిల్లుల వద్దనే నిలిచిపోతుండటంతో లారీల కొరత ఏర్పడింది. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. బిచ్కుంద మండలంలోని గోపన్ పల్లి చౌరస్తాలో గల అయ్యప్ప మందిరం వద్ద అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ అమృతవర్షిని, తహసిల్దార్ భరత్ తమ సిబ్బందితో కలిసి గత రెండు రోజులుగా రోడ్డుపై వెళ్తున్న లారీలను ఆపి వరి కొనుగోలు కేంద్రాలకు తరలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా రోజు ఆరు నుండి ఎనిమిది లారీలను తరలించినట్టు అధికారులు తెలిపారు.



అధికారులు తనిఖీలు చేపట్టగా.. వారి ముందు నుంచే వెళ్తున్న ఇసుక లారీ



అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలను పట్టించుకోని అధికారులు

వరి కొనుగోలు కేంద్రాలకు లారీలను తరలించేందుకు రోడ్డుపై మాటు వేసిన అధికారులు మంజీర పరివాహక ప్రాంతం నుండి అధిక లోడుతో లారీలు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తునాన అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. వారి ముందు నుంచి పదుల సంఖ్యలో లారీలు, టిప్పర్లు వెళ్తున్నా పక్కనే ఉన్న అసిస్టెంట్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ లారీలను ఆపకపోగా వాటి విషయం పట్టించుకోకపోవడంతో అక్కడ ఉన్న రైతులు, ప్రజలు విస్మయం చెందారు. అధిక లోడుతో వెళ్తున్న లారీల ద్వారా రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ఈ విషయం పట్టించుకోకుండా మామూలు ప్రజల పైన చూపించే ప్రతాపం రోడ్డు రవాణా శాఖ అధికారులు అధికలోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లు, లారీల పైన చూపెట్టకపోవడంతో అధికారుల పనితీరుపై ప్రజలు పలు సందేహాలు వ్యక్తం చేశారు.

ఐక్యతగా ఉండాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం లో బాగంగా జిల్లా కార్యదర్శి పుల్గం హన్మాండ్లు, జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జు దత్తాద్రి, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గుజ్జెటి నర్సయ్య సమక్షంలో శుక్రవారం సుమారు 200 మంది సభ్యత్వం తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంఐక్యతను కాపాడుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదు చురుకుగా సాగుతున్నందున సభ్యత్వ నమోదు గడువు తేదిని ఈనెల 31 వరకు పొడిగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు అంబల్ల శ్రీనివాస్ 3వ తర్ప అధ్యక్షులు చిట్ల యెగ్నేష్, మాజీ కౌన్సిలర్ గుద్దెటి రమేశ్, యువనాయకులు కాండీ ధర్మపురి, దాసరి సునీల్ కుమార్ నిజామాబాద్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వీవోఏల డిమాండ్లు పరిష్కరించాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం వద్ద వీవోఏలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కులచారి దినేష్ సందర్శించి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ డిచ్పల్లి ఎంపీపీ భూమన్న చందమియ బాగ్ సర్పంచ్ కిషన్ నాయక్ పద్మా రెడ్డి బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ వీఆర్ఏలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

నవతెలంగాణ-నవీపేట్



వీఆర్ఏలకు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నెరవేర్చాలని వీఆర్ఏ సంఘం మండల అధ్యక్షులు పెంటయ్య శుక్రవారం డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రారం బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో సీఎం కేసీఆర్ వీఆర్వో వ్యవస్థ రద్దు చేసిన సందర్భంగా ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో నీరడీ లక్ష్మణ్, ప్రభాకర్, రంజిత్, గిరి, భూమయ్య నరేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ చేయను

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-ఏర్గట్ల/కమ్మర్‌పల్లి

మండలంలోని తాళ్ళరాంపూర్, తడపాకల్, తొర్తి గ్రామాల్లో వలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి శుక్రవారం మంత్రి వేముల గ్రామాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా 6 కోట్ల 43 లక్షల వ్యయంతో కమ్మర్‌పల్లి నుండి తడపాకల్ వరకు బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు తాళ్ళ రాంపూర్‌లో శంకుస్థాపన చేశారు. తొర్తి గ్రామంలో కోటీ 45 లక్షల వ్యయంతో స్లాబ్ కల్వర్టు బ్రిడ్జి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రతి పక్షాలకు ఛాలెంజ్ విసురుతున్నానని నియోజకవర్గంలో అభివృద్ధి జరగకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని, ప్రజలు అభివృద్ధికి మాత్రమే పట్టం కడతారని వారు అన్ని గమనిస్తున్నారని అన్నారు. ఏ పార్టీయో తెలియని ఒకాయన నన్ను హేళన చేసి మాట్లాడుతున్నాడని ఆయనకు ప్రజలే బుద్ధిచెప్పే రోజులు ఇంకెంతో కాలం లేదని అన్నారు. బీజేపీ పార్టీకి చెందిన ఎంపీ అరవింద్ నోరు తెరిస్తే తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని, ఆయన ప్రజలకు మంచి చేసే ఆలోచన చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి దగ్గర నుండి నిధులు తెచ్చి గ్రామాలను అభివద్ధి చేసినట్లే, ప్రధానమంత్రి దగ్గర నుండి నిధులు తీసుకువచ్చి ప్రజలకు మంచి చేయాలని హితువు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,వైస్ ఎంపీపీ సల్ల లావణ్య,బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, సర్పంచులు పత్తిరెడ్డి ప్రకాష్, కుండ నవీన్, తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ అష్రాఫ్, నాయకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పునరుద్ధరణకు శంకుస్థాపన

రూ. 6 కోట్ల 43 లక్షలతో పనులు

కమ్మర్‌పల్లి :మండలకేంద్రమైన కమ్మర్‌పల్లి నుండి ఏర్గట్ల మండలం తడపాకల్ గ్రామం వరకు రూ.6 కోట్ల 43 లక్షల నిధులతో బిటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర రోడ్లు భవనాలు, గహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంతి రెడ్డి శంకుస్థాపన చేశారు.



ఏర్గట్లలో..



కమ్మర్‌పల్లి మండలంలో..

శుక్రవారం మండలంలోని ఉప్లూర్‌లో బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రికి మహిళా సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, ఎంపీపీ అధ్యక్షరాలు లోలపు గౌతమి, సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు రాధా రాజా గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, ఆర్అండ్‌బి ఎస్‌సి రాజేశ్వర్ రెడ్డి, ఈఈ సురేష్, డిఈ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవారి మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంతెనలు, కల్వర్టు పనులకు భూమిపూజ

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతోనే బాల్కొండ మండలం అభివద్ధి చెందుతుందని బాల్కొండ నాయకులు తెలిపారు. మండలంలోని ఇత్వార్ పేట్, జలాల్పూర్, చిట్టాపూర్ గ్రామాల్లో శుక్రవారం వంతెనలు, కల్వర్టల నిర్మాణంకోసం బాల్కొండ ఎంపీపీ లావణ్య లింగాగౌడ్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో భారీవరదలకు కోతకు గురైన వంతెనలు, కల్వర్టు నిర్మాణం కోసం మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఎఫ్‌డిఆర్ నిధులు ద్వారా ఇత్వార్‌పేట్ వంతెనకు రూ. 48లక్షలు, జలాల్‌పూర్ వంతెనకు రూ.29 లక్షలు, చిట్టాపూర్ కల్వర్టు నిర్మాణం కోసం రూ.7 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గడ్చుందా కల్పనఅనీల్, సంతకుల సాయమ్మజువ్వన్న, చాట్లపల్లి వనజగోవర్ధన్ గౌడ్, ఎంపీటీసీలు సనుగుల కవితశ్యామ్ సుందర్, ఎంపీడీఓ సంతోష్ కుమార్, డిఈ మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్‌లు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు తౌటు గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్, వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను సన్మానించిన యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి శివారులోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 9.8 జీపీఏ సాధించిన తొమ్మిది మంది విద్యార్థులను 9.7 జీపీఏ సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పాలనాధికారి పద్మ మాట్లాడుతూ.. 9 మంది విద్యార్థులు 9.8 జీపీఎస్ సాధించి 8 మంది విద్యార్థులు 9.7 జీపీఎస్ సాధించడంతోపాటు 100శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గొప్ప పేరు తెచ్చారని అన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు కృషిచేసిన ఉపాధ్యాయులకు సహకరించిన తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విధంగా పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ ఇన్చార్జ్ శ్రుపన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాలంట్ వారియర్ అవార్డు అందుకున్న రైల్వే ఉమెన్ కానిస్టేబుల్

మాజీ రాష్ట్రపతి నుండి రూ. 50వేల నగదు పురస్కారం



అవార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ సరళ

నవతెలంగాణ-కంఠేశ్వర్



రైల్వే ఉమెన్ కానిస్టేబుల్ సరళ గాలంట్ వారియర్ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా మాజీ రాష్ట్రపతి నుండి రూ. 50వేల నగదు పురస్కారం సైతం అందుకున్నారు. గత సంవత్సరం హైదరాబాద్ నుండి నిజామాబాద్‌కు వచ్చిన దేవగిరి రన్నింగ్ ట్రైన్ నుండి ఓ మహిళ దిగే ప్రయత్నం చేసింది. దీంతో ఆమె తల ట్రైన్ మధ్యలో ఇరుక్కునే సమయంలో అక్కడే డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ కుమారి సరళ తన ప్రాణాలను లెక్కచేయకుండా కాపాడింది. ఈనెల 11న నిజామాబాద్‌కు చెందిన ఆర్‌పీఎఫ్ మహిళ కానిస్టేబుల్ సరళ, దక్షిణ మధ్య రైల్వే నుండి హైదరాబాద్ డివిజన్ వార్డీ నహీ యే కాల్ హై సిటిజన్ గాలంట్ వారియర్ అవార్డు 2023 అవార్డుతోపాటు మాజీ రాష్ట్రపతి నుండి రూ. 50వేల నగదు పురస్కారం అందుకున్నారు. భారతదేశం శ్రీ రామ్ నాథ్ కోవింద్ డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్, 15 జనపథ్, న్యూఢిల్లీ నగదు పురస్కారం అందుకుంది. ఇందుకు నిజామాబాద్ ఆర్పిఎఫ్ పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే ఆటోలు నడపాలి

ఎస్ఐ యాదగిరిగౌడ్

నవతెలంగాణ-మాక్లూర్



రోడ్లపై నడపే ఆటో డ్రైవర్లు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద మై ఆటో మై సేఫ్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో కచ్చితంగా నిబంధనలను పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా మాక్లూర్ మండలంలో ఎన్ని ఆటోలు కలిగి ఉన్నాయనే వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముఖ్యమంత్రి కెసిఆర్ 2020 లో కొత్త రెవెన్యూ చట్టం తెస్తున్న సందర్భంగా విఆర్ఓ వ్యవస్థను రద్దు చేసిన సందర్భంగా నిండు అసెంబ్లీ సాక్షిగా స్వయానా ముఖ్యమంత్రి విఆర్ఏ లకు పే స్కేల్, అర్హత కలిగిన వి.ఆర్.ఏ లకు పదోన్నతులు, 3.55 సంవత్సరాలు దాటినా వి.ఆర్. ఏ ల వారసులకు ఉద్యోగాలు ఇస్తానని ముఖ్యమంత్రి విఆర్ఏ లకు హామీ ఇచ్చినారని కాని నేటికి రెండున్నరేళ్ళు గడిచిన అమలుకు నోచుకోలేదని విఆర్ఏ లో సంఘం అధ్యక్షులు నీరడి గంగాధర్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో దండు సూర్య రాజ్, తొండకురి నర్సయ్య, తలారి మోహన్, భాగ్యం మండల విఆర్ఏ లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో డీఈఓకు వినతి



నవతెలంగాణ-కంఠేశ్వర్

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ కు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. మధ్యాహ్న భోజన జిల్లా నాయకురాలు చామంతి లక్ష్మి మాట్లాడుతూ.. నాలుగు నెలల నుండి ప్రైమరీ, హై స్కూల్ ఎండిఎం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు రాక కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుడ్డుబిల్లు ఇంతవరకు రాక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ధరలకు అనుగుణంగా విద్యార్థికి 15 రూపాయలు స్లాబ్‌రేట్ ఇవ్వాలని సీఎం పెంచిన వేతనం 3,000 వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముబారక్ నగర్ లక్ష్మి, సుజాత, సురేందర్ రెడ్డి, జిల్లా నాయకులు కొండ గంగాధర్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో ఎస్ఎస్ఆర్ జిల్లా స్థాయి ర్యాంక్





నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సీబీఎస్ఈ ఫలితాలలో ఎస్ఎస్ఆర్ విద్యార్థులు జిల్లాస్థాయి ర్యాంక్ సాధించారని డైరెక్టర్ మారయ్య గౌడ్ అన్నారు. సీబీఎస్ఈ 10, 12వ తరగతి ఫలితాలలో ఎస్ఎస్ఆర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. 12వ తరగతి ఫలితాల్లో 500మార్కులకు గాను శ్రేయాస్ 436 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో, నాగవైష్ణవి 40 ద్వితీయ స్థానం, శ్రీ నిత్య 383 తతీయ స్థానంలో నిలిచారని చెప్పారు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఎస్ఎస్ఆర్ డిస్కవరి స్కూల్, ఎస్ఎస్ఆర్ సిబిఎస్ఈ స్కూల్ జన్నెపల్లి విద్యార్థులు 100 శాతం ఫలితాలతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఎస్ఎస్ఆర్ సిబిఎస్ఈ స్కూల్ విద్యార్థులు శ్రీశాంత్ రెడ్డి 453, షేక్ శయాన్ ఆలీ 444, అమాన్ అజాస్ 417, ఆర్ కనిష్కగౌడ్ 413, మరియం మహిన్ 412, కుంట రోహన్ 410, జాదవ్ కౌశిక్ రామ్ 410, ఆదె యశస్విని 407, విధి చప్పర్వాల్ 406, బి.శివాని 405, డి.శ్యామ్ కైలాష్ 404, కీర్తన 403, ఆకుల విగ్నేష్ 401మార్కులు సాధించారని చెప్పారు. మొత్తం 13 మంది విద్యార్థులు 400లకుపైగా మార్కులు సాధించారని వివరించారు. సబ్జెక్ట్ వారిగా ఇంగ్లీష్‌లో 2, తెలుగులో 07, హిందీ 07, మ్యాథ్స్ 02, సైన్స్ 02, సోషల్ 01 విద్యార్థులు 90కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, మంచి ఫలితాలు రావడానికి కృషి చేసిన టీచర్లను ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మారయ్య గౌడ్, సీఈవో హరితగౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్ మెరిగ అభినందించారు.

పాముకాటుతో వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శాంతభాయ్ (65) గురువారం రాత్రి పాము కాటుతో వేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ శుక్రవారం తెలిపారు పోలీసుల కథనం ప్రకారం,,, గురువారం రాత్రి ఉక్కపోతగ ఉండటంతో అరుబయట పడుకుంటాను అని ఇంట్లో వాళ్లకు చెప్పి నిద్రపోయింది. ఈసమయంలో పాము కాటువేయడంతో ఇంట్లో వాళ్ళు వచ్చి పామును చంపేశారు. ఉదయం 3గంటల సమయంలో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు కుమ్మరి ముత్తన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు.

సీబిఎస్ఈలో ఎన్జీఎస్ ఉత్తమ ఫలితాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సిబీఎస్ఈ నిర్వహించిన 2022- 23 సంవత్సర 10వ తరగతి ఫలితాల్లో నవ్యభారతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని ఎన్జీఎస్ చైర్మన్ క్యాతం సంతోష్ కుమార్, క్యాతం శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వందశాతం ఫలితాలు సాధించినందుకు గర్వంగా ఉందని చెప్పారు. తమ పాఠశాల విద్యార్థులు 500 మార్కులకుగాను 400 పైచిలుకు మార్కులు 8మంది విద్యార్థులు సాధించారని అన్నారు. రియన్ష్ రెడ్డి 469, ఫాతిమా సన438, లోహిత్ అక్షయ్ రెడ్డి436, అలీషా 424, రేణుక సురేంద్ర 420, మానస్వి 412 ఉదితి గుప్తా410, రిషిత్ గుప్తా409 మార్కులు సాధించారని అన్నారు. ఉత్తమ ఫలితాలకు సహకరించిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



నర్సుల సేవలు వెలకట్టలేనివి

అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

నర్సులు చేసే సేవ వెలకట్టలేనిదని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మదర్ థెరిస్సా వారసులని, ఎలాంటి కల్మషం లేకుండా పేషంట్స్‌కు అందించే సేవ గొప్పదని అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ దవాఖానాలో నర్సులు, వైద్యబందంతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ కట్ చేసి వారికి అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నర్సులను శాలువాతో సత్కరించారు.

కంఠేశ్వర్:జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో గల సరస్వతి ఎంపీహెచ్‌డబ్ల్యూ మహిళల ట్రైనింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నర్సింగ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సులోచన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం నర్సుల చేతిలోనే



కంఠేశ్వర్: నర్సుల దినోత్సవం కార్యక్రమం ప్రారంభిస్తున్న మంత్రి

ఉంటుందని, నర్సులు చేసేది సేవ అని కొనియాడారు. మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకొని ఎంతోమంది నర్సులు సేవలను అందిస్తున్నారని అన్నారు. సేవ భావం ప్రతి ఒక్కరిలో అలవర్చుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా సులోచనను సరస్వతి ఎంపి హెచ్‌డబ్ల్యు మహిళల ట్రైనింగ్ ఇన్స్టిట్యూషన్ నందు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ రమేష్ గౌడ్ ప్రిన్సిపాల్ మహేష్ కుమార్, మాల శ్రీ, ప్రియాంకాలతో పాటు నర్సులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :ఆస్పత్రులకు వచ్చే రోగులకు నర్సుల సేవలే కీలకమైనవని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు అన్నారు. పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వారి సేవలను గుర్తు చేస్తూ అభినందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం రోగుల్ని కంటికి రెప్పలా కాపాడుకొనే నర్సులే గొప్ప అని అన్నారు. ఒక రోగి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. కార్యక్రమంలో హెడ్ సిస్టర్ రేబాక, స్టాఫ్ నర్స్ పద్మలత, కుసుమకుమారి, తారాబాయి ,రేణుక, యాదమ్మ, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో...

అభిమానులు జన్మదిన వేడుకలు చేయడం ఆనందంగా ఉంది

- ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతి సంవత్సరం మాదిరిగానే అభిమానులు జన్మదిన వేడుకలు చేయడం ఆనందంగా ఉందని దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. ధనపాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ధన్‌పాల్ సూర్యనారాయణ జన్మదినం శుక్రవారం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన అనుచరులు, అభిమానులు పగడాల దుబ్బ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని, ధన్‌పాల్ సూరన్న యువసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. వర్షాల వల్ల ఇల్లు కూలిపోయిన వారికి నూతన గహాన్ని అందజేసి వారికి నేనున్నానని భరోసా కల్పించారు. కంఠేశ్వర్‌లోని మహాలక్ష్మి మందిరానికి ఐదు లక్షల రూపాయలు ట్రస్ట్ ద్వారా అందజేశారు.

ఈ సందర్భంగా ధనపాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణ మాట్లాడుతూ కార్యకర్తల కోసం, ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తానని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాను అని అన్నారు. పేద మధ్యతరగతి వారికి ఆదుకునేందుకే ధన్పాల లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ముందుంటుంది హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగొళ్ల లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ గోపిడి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్కర్ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, మెట్టు విజయ్, సుక్కా మధు, పంచ రెడ్డి శ్రీధర్, ఎర్రం సుధీర్, ఇల్లందుల ప్రభాకర్, బూర్గుల వినోద్ కుమార్, సందగిరి రాజశేఖర్ రెడ్డి, శివుని భాస్కర్, అంత రెడ్డి హరీష్ రెడ్డి బిజెపి నాయకులు పాల్గొన్నారు.



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ధన్‌పాల్

పాడె మోసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగారెడ్డి మృతి చెందడంతో ఆయన అంత్యక్రియల్లో ఎల్లారెడ్డి సభ్యులు జాజాల సురేందర్ శుక్రవారం పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని బొల్లారం సమీపంలో గురువారం రాత్రి రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో అక్కడికక్కడే మృతి చెందడానికి గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో సర్పంచ్ అనిల్‌రెడ్డి, ఎంపీటీసీ ఇందిరా, సాయికిరణ్, కోఆప్షన్‌మెంబర్ బాబు, జానీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మోస్రాలో వీఆర్ఏల సమ్మె

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలో గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు శుక్రవారం ఒక్కరోజు సమ్మె చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా తమకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని నినాదాలు చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్ద ఎత్తున సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సమ్మెలో పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వీఆర్ఏలు

అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-పిట్లం

అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దాపూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ డివిజన్ పరిధిలోని నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన కేసరి జగదీష్ (27) హార్వెస్టర్ ఓనర్‌కు అప్పులు ఎక్కువ అయ్యాయని ఈ క్రమంలో అప్పుల బాధ భరించలేక మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య కేసరి శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా మృతునికి ఇద్దరు కూతుర్లున్నారు.

బాన్సువాడలో రైతుబంధు వేడుకలు



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న పలువురు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కేకు కట్ చేసి రైతులకు తినిపించారు. అనంతరం అంజిరెడ్డి మాట్లాడుతూ.. రైతుబంధు పథకం చారిత్రాత్మక పథకమని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని తెలిపారు. వీరి వెంట నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



ఎస్ఐని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సుధాకర్‌ను జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, నాయకులు శుక్రవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో విధి నిర్వహణలో ఉత్తమమైన విశిష్ట సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవా పథకం అవార్డును రాష్ట్ర డిప్యూటీ సీఎం, హోం మంత్రి మెహమూద్ అలీ చేతుల మీదుగా అవార్డు పొందారని, ప్రజలకు మరింతగా సేవలు చేసి ఫ్రెండ్లీ పోలీస్ సేవలను అమలు చేయాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమంగా పైస్థాయిలో అవార్డులు పొందాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు తీగల తిరుమలగౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఐరేని నర్సయ్య, వార్డు సభ్యులు ఐరేని రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బత్తిని సిద్ధ రాములు తదితరులు పాల్గొన్నారు.

పోతాయిపల్లిలో కంటి వెలుగు ప్రారంభం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు సర్పంచ్ ఆకుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించి ఈ పథకం ప్రారంభించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజలకు అవసరమైన పథకాలు అమలు చేస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మటం అంజయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఆకుల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు గన్నారం ఆశయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వీడీసీ అధ్యక్షులు మట్టం మల్లయ్య, యూత్ అధ్యక్షులు హరీష్, గైరబోయిన అంజయ్య, పెద్దబోయిన సాయిలు, మహిళా అధ్యక్షురాలు మాటం అంజవ్వ, డాక్టర్లు విజయ, ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, ఆశాలు, మమత, గంగామని, సుజాత, స్వప్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో నిర్వహించే సీఎం కప్ కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడాపోటీలకు ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకోవాలని బోధన్ ఎంపీడీఓ పర్సన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనే అభ్యర్థులు 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డ్, పదో తరగతి మెమోతో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ క్రీడాపోటీలకు మండలంలోని గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల నుంచి జట్లను పంపాలని కోరారు.

ఇష్టపడి చదివి ఉద్యోగం పొందాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- విద్యార్థులను సన్మానించిన కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి

ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివి 10 జీపీఏ సాధించిన ఇద్దరు విద్యార్థులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. లింగంపేట్ మైనారిటీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదివిన షాభాజ్, కామారెడ్డి మైనారిటీ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదివిన గౌసియా 10 జీపీఏ సాధించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, రీజినల్ లెవెల్ కౌన్సిలర్ ఎం.ఎ.బషీర్, విజిలెన్స్ అధికారులు మహమ్మద్ హైమద్ ఉద్దీన్, షేక్ హైమద్ జియా, ప్రిన్సిపాల్ వెంకటరమణ, ప్రణీత అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లను పరిశీలించాలి..

రాజకీయ పార్టీల ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాలో తప్పులను సవరించడానికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 18 ఏండ్లు నిండిన ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోతే వారి నుంచి బూతు లెవల్ ఏజెంట్లు దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఒక ఓటర్ పేరు జాబితాలో రెండు చోట్ల ఉంటే ఒకటి తొలగించడానికి ఓటర్ నుంచి దరఖాస్తు స్వీకరించాలని చెప్పారు. ఏమైనా అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల నాయకులు డివిజన్ స్థాయిలో ఆర్డీవోకు ఫిర్యాదు చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమైన వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో లేకపోతే వారి పేర్లను బూత్‌లెవల్ ఏజెంట్లు పరిశీలించి కొత్తగా దరఖాస్తులు చేయించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఓటర్ల జాబితాలో పేర్లను పరిశీలన చేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్

19వ రోజుకు వీవోఏల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-ఎడపల్లి/వర్ని

మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల వీవోఏలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీవోఏల అధ్యక్షులు పోచయ్య మాట్లాడారు.. ఐకేపీ ఆధ్వర్యంలో గ్రామ వీవోఏలు క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల అభ్యున్నతి కోసం తాము నిరంతరం పాటుపడుతున్నప్పటికీ ప్రభుత్వం తమ సమస్యల డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తమ వంతుగా పాల్గొంటున్నప్పటికీ వీవోఏల పట్ల తెలంగాణ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పోచయ్య, సుదర్శన్, యూసుఫ్, రేణుక, సరస్వతి, కుమ్మరి పుష్ప, సంధ్య, సవిత, లత, మంజుల, స్వప్న, శోభ, అనురాధ, అనిత, గాయత్రిలతో పాటు ఆయా గ్రామాల వీవోఏలు సమ్మెలో కూర్చున్నారు.



ఎడపల్లి : నిరవధిక సమ్మెలో పాల్గొన్న వీవోఏలు

వీవోఏలకు బ్యాంక్ ఉద్యోగుల మద్దతు..

ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ) కార్యాలయం ఎదుట మండలంలోని ఆయా గ్రామాల వీవోఏలు నిరవధిక సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. కాగా శుక్రవారం సమ్మె 19వ రోజుకు చేరుకుంది. తమ డి మాండ్ల సాధనకై సమ్మె చేపడుతున్నట్టు వీవోఏలు తెలిపారు. ఎడపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు బ్యాంకు సిబ్బంది నిరవధిక సమ్మె శిబిరానికి చేరుకుని మద్దతు పలికారు. సుదర్శన్, పోచయ్య, లతా మాధవి, కుమ్మరి పుష్ప, సంధ్య, నసీరా బేగం, మంజుల, యూసుఫ్, ఆయా గ్రామాల వీవోఏలు సమ్మెలో కూర్చున్నారు.

ఐకేపీ వీవోఏలకు అండగా ఉంటాం..

వర్ని(మోస్రా) : మండలంలోని ఐకేపీ వీవోఏల సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీవోఏలకు ఎన్‌పీఆర్‌డీ జిల్లా నాయకులు కవితరెడ్డి రాములు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలలో మహిళ సంఘాలను ఏర్పాటు చేసి వారి కుటుంబాలు ఎదుగుదలకు వీవోఏల కృషి ఎంతగానో ఉందన్నారు. వారి కష్టానికి తగ్గ రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లను అమలు చేయాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఆటోలు నడపాలి

- ఏసీపీ కిరణ్ కుమార్

నవతెలంగాణ-బోధన్

ఆటో నిర్వాహకులు, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ఆటోలు నడపాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చట్టరీత్యా కేసులు చేస్తామని హెచ్చరించారు. కొంతమంది డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడుపుతూ ప్రమాదానికి కారణం అవుతున్నారని, అలాంటివి మానుకోవాలని సూచించారు. ఆటోలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో సమర్పించాలన్నారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. డ్రైవర్లు 8వ తరగతి పాస్ అయి, 20 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, మైనర్లు ఆటోలు నడపవద్దని సూచించారు. ముఖ్యంగా ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి సీటు వెనక ఆటో వివరాలు ఉండాలని, బస్టాండ్‌లో నిబంధనలు పాటించకుండా ఆటోలు తీసుకువచ్చి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దని అన్నారు. ప్రతి డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఆటోపై ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గుర్తింపు నెంబరు రాయించాలన్నారు. ఒక ఆటోలో ఇద్దరు ముగ్గురు ప్రయాణికులకంటే అనుమతి లేదని, డ్రైవర్‌కు ఇరువైపులా ఉండే సీట్లు తొలగించాలని, లేనియెడల వారిపై కేసులు చేస్తామన్నారు. పోలీసులకు ఆటో యజమానులు సహకరించి, ఆటోలు నడపాలన్నారు. సమావేశంలో ఎంవీఐ యశ్వంత్, పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించొద్దు

- ఆర్టీసీ డిపో మేనేజర్ సదాశివ

నవతెలంగాణ-పిట్లం

ప్రయివేటు వాహనాలను ఆశ్రయించవద్దని బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సదా శివ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దెల చెరువు గ్రామంలో ప్రైవేటు వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఆటోలో పరిమితికి మించి ప్రయాణిస్తున్న ప్రయాణికులను దింపి ఆర్టీసీ బస్సులో తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఎన్నో సేవలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే కలుగుతుందని, ప్రయాణమే కాకుండా వికలాంగులకు, విద్యార్థులకు, ప్రయాణ సమయంలో ఫ్యామిలీ బెనిఫిట్స్, వివాహాలకు రాయితీతో ఇంటి ముందే ఆర్టీసీ పథకాలను అందిస్తున్న సంస్థ ఆర్టీసీ అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ బస్సీలాల్, సిబ్బంది రాములు, నాగనాథ్, పోలీసు సిబ్బంది ఓంకార్ కాషాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ సదాశివ

తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని

రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ జన్మదినం సందర్భంగా ముఖ్య అతిథిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ హాజరై ఆయన మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యాన్ని ఇథినాల్ తయారు చేయడానికి ఉపయోగపడుతుందని అటువంటి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయకుండా రైతులకు గోసపెడుతుందని ఎంపీ అన్నారు. ప్రభుత్వ భూమిని తక్కువ ధరకే డబ్బున్న వారికి కేసీఆర్ కుటుంబం అమ్ముకుంటున్నారని, దళితులకు ఎక్కడ మూడెకరాల భూమిని ఇవ్వడం లేదని ఆరోపించారు. దళితులకు అందించే మూడు ఎకరాల భూమి కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాలను దళితులకు ఇస్తానని నమ్మబలికిన కేసీఆర్ పంగనామం పెట్టాడని, ప్రతి ఒక్క దళితుడికి 10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి తుంగలో తొక్కారని అన్నారు. దళిత బంధు పథకం కింద దళిత బంధు స్కీం ఇచ్చిన ఒక్కో దళితుని దగ్గర ప్రతి ఎమ్మెల్యే 5 లక్షల రూపాయలు తీసుకున్నాడన్న విషయాన్ని కేసీఆర్ సమావేశంలో అన్నమాటలే అని గుర్తు చేస్తూ ఆ ఎమ్మెల్యేల పేర్లను ఎందుకు బయట పెట్టడం లేదని, అదేవిధంగా వారిపైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిన కనీసం 500 ఇండ్లు అయినా ఎవరికి ఇవ్వడం లేదని, ఒకవేళ ఇచ్చిన అవికూడా బీఆర్ఎస్ నాయకులకు డబుల్ బెడ్ రూములు ఇండ్లను ఇస్తున్నాడని అన్నారు. తెలంగాణ యూనివర్సిటీని 3 కోట్ల రూపాయలు పూర్తిగా అప్పుల పాలు చేశాడని, పోలీస్‌లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల అందర్నీ కేసీఆర్ కుటుంబానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధన్పాల్ సూర్యనారాయణ, పల్లె గంగారెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

స్పీకర్ దంపతులకు పెండ్లిరోజు శుభాకాంక్షలు

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పెండ్లి రోజు సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. వర్ని, రుద్రూర్, చందూర్, మోస్రా మండలాల్లో పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు.



స్పీకర్ దంపతులు

కంటి వెలుగు శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్నూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్ఞానేంద్రియాలలో ముఖ్యమైనది కన్ను అన్నారు. కండ్లు లేకుంటే ప్రపంచాన్ని చూడలేమని చెప్పారు. ముఖ్యమంత్రి ముందు చూపుతోనే కంటి సమస్యలు ఉండవద్దని కంటి వెలుగును ప్రారంభించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గైని అనుసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ సాయవ్వ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, బీఆర్‌యస్ మండలాధ్యక్షుడు బోలిపెల్లి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నర్సింగ్ దినోత్సవం



నర్సులను సన్మానించి కేక్ తినిపిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ నర్సింగ్‌డేను ఘణంగా నిర్వహించినట్టు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మెన్ డొంగ్రే ఉమాకాంత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిలో ఉదార స్వభావంతో ప్రజలకు సేవలు అందిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఎక్కడా కూడా వెనకడుగు వేయకుండా సమాజ సేవలో ముందంజలో ఉంటుందని, తోడుగా నర్సులు కూడా ప్రధాన పాత్ర ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్లను సన్మానించిన జెడ్పీటీసీ



టాపర్లను సన్మానిస్తున్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు పదో తరగతి ఎస్సెస్సీ పరీక్ష ఫలితాలలో మండల టాపర్లుగా నిలిచారు. 9.8 జీపీఏ సాధించిన అందే శివాని, నర్రాగుల కీర్తి, 9.7జీపీఏ సాధించిన గొల్ల ఐశ్వర్య, సనా తన్వీర్‌లను జడ్పీటీసీ సభ్యుడు తీగల తిరుమల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, కో ఆప్షన్ మెంబర్ షిమ్మి శుక్రవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్ అంజలి మాట్లాడుతూ.. విద్యార్థినీలు భవిష్యత్తులోనూ ఉన్నత లక్ష్యంతో పై చదువుల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు నయీమ్, నర్రాగుల ఎల్లం, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో సీఎం కప్ క్రీడలు

నవతెలంగాణ-వర్ని

వర్ని, చందూర్, రుద్రూర్, మోస్రా మండల కేంద్రాలలో సీఎం కప్ 2023 క్రీడలు 14, 15, 16, 17 తేదీల్లో కొనసాగుతాయని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, చందూర్ ఎంపీపీ లావణ్య రామ్‌రెడ్డి, మోస్రా ఎంపీపీ ఉమా శ్రీరాములు, రుద్రూర్ ఎంపీపీ సుజాత నాగేందర్, ఎంపీడీవోలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనవలసిన వారు ఎంపీడీవో కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

నిధుల ప్రొసీడింగ్ కాపీలు అందజేత

నవతెలంగాణ-మోపాల్



మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం భవన నిర్మాణానికి 5 లక్షలు, ముస్లిం కమిటీ హాల్‌కు 3 లక్షలు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ నిధుల నుండి శుక్రవారం అందజేశారు. కుల సంఘాలు, గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుదురు సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు

ముగిసిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మండలంలోని సాంపల్లి గ్రామంలోని శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన చౌడమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం యాదవ సంఘ సభ్యులు ఇంటికో బోనం తీసి ఊరేగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

- తహసీల్దార్‌కు వినతిపత్రం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/మోపాల్/ఆర్మూర్/ధర్పల్లి

వీఆర్ఏల సమ్మెలో భాగంగా శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు రొడ్డ సాయన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చిన దానిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హతగల వీఆర్ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. 80 రోజుల సమ్మె కాలపు వేతనం ఇప్పించాలని కోరారు. వీఆర్ఏ లందరికీ పే స్కేల్ ద్వారా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.



ధర్పల్లిలో..



మోపాల్‌లో..



జక్రాన్‌పల్లి

కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గంగాధర్ కార్యదర్శి షాదుల్లా కోశాధికారి మధు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని వీఆర్ఏ జేఏసీ కమిటీ అధ్యక్షుడు బియ్య సాయినాథ్ మాట్లాడుతూ మునుగోడు ఎలక్షన్ సమయంలో ఐటీ మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు తమతో చర్చలు జరిపనందున తహ్లాషిల్దార్ కార్యాలయం వద్ద ఒకరోజు నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వీఆర్ఏలకు పేస్కేల్ ఇవ్వాలని, అలాగే 55 సంవత్సరాలు నిండిన వీఆర్ఏ ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలు కల్పించాలని, అర్హతలను వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలని తమ విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మార్వో లతకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం తమను గుర్తించాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి కే. గంగారం, కన్నర్ల శ్రీనివాస్, తుంగపల్లి నరేష్, అజ గంగారం, తదితరులు పాల్గొన్నారు

ఆర్మూర్: రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఆలూరు తహసీల్దార్ కార్యాలయం ముందర వీఆర్ఏలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. పే స్కేలు జీవో విడుదల చేయాలని, 55 సంవత్సరాల పైబడిన వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని, పదోన్నతులు కల్పించాలని అన్నారు తహసీల్దార్ దత్తాత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలూరు మండల నూతన అధ్యక్షులు గున్నం సంతోష్, ప్రధాన కార్యదర్శి నల్లయ్య, గౌరవ అధ్యక్షులు అబ్బ సుధాకర్, కోశాధికారి సంపత్, ఉపాధ్యక్షులు రాజు, వంశీ, సాయిరాం, నరేష్, సరిత, గీత పద్మారావు పాల్గొన్నారు.

ధర్పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామిని నెరవేర్చాలంటు వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు, ఈసందర్భంగా వీఆర్ఏల డివిజన్ అధ్యక్షుడు చెలిమెల రాములు మాట్లాడుతు గతంలో ప్రభుత్వం తమకు పెస్కేల్ అందిస్తామని చెప్పి మీనమేషాలు లెక్కిస్తుందని అన్నారు. నిలిచినా కారుణ్య నియామకాలు చేపట్టి ,ఉద్యోగ భద్రతా కల్పించి వీఆర్ఏలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమములో మండల అధ్యక్షుడు లొక్కడి హరిచారం,జెఏసి కన్వీనర్ కిరణ్,సరిత రెడ్డి,గంగరాజ్యం,శ్రీకాంత్,నీనానంద,నర్సయ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్ ఇంఛార్జి తహసీల్దార్‌గా పి.శ్రీకాంత్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ (ఎఫ్ఏసీ) ఫుల్ అడిషనల్ ఇంఛార్జి తహశీల్దార్‌గా పి.శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో తోటి ఉద్యోగస్తులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహశీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ,,, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది సూపరెండేట్ దశరథ్, ఆర్ఐ గంగారాం, జూనియర్ అసిస్టెంట్ రవిదాస్, సర్వేయర్ అంజలి, నరేష్ తదితరులు పాల్గొన్నారు..

గంగారెడ్డికి పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రానికి చెందిన మండల బిజెపి ఉపాధ్యక్షుడు గంగారెడ్డి ఇటీవల హార్ట్ ప్రాబ్లమ్‌తో హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటికి తిరిగిరాగా జైడి గంగారెడ్డి నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ కులచారి దినేష్ పరామర్శించారు. ఆయన వెంట డిచ్పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, పద్మా రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు, పడకల్ తాండ సర్పంచ్ కిషన్ నాయక్, దినేష్ శక్తి కేంద్ర ఇంచార్జ్, జక్కం కార్తీక్, మునిపల్లి శక్తి కేంద్ర ఇంచార్జ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కుల అందజేస్తున్న ఇన్‌చార్జి సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్.కె. భాషా-ఎఎస్ఐ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా రూ.5లక్షల గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సి. హెచ్. ప్రవీణ్ కుమార్ మృతుడి భార్య గౌసియా బేగంకి అందజేశారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) జి. మధుసుదన్‌రావు, నిజామాబాద్ పరిపాలన అధికారి (ఎఓ) బి. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఆఫీస్ సూపరింటెండెంట్ మక్సూద్ హైమద్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, భద్రతా సెక్షన్ ఇంచార్జీ పి. రాజేశ్వర్, కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

మెండోరాలో ఆజాదికా అమృత్ మహోత్సవం



మాట్లాడుతున్న డీపీఎం నీలిమ

నవతెలంగాణ-మెండోర

మండలకేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఏపీఎం విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో అజాధిక అమృత్ మహోత్సవం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఐకెపి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డిపిఎం(ఎఫ్ఐ) నీలిమ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులకు పలు అంశాలపై సూచనలు కల్పిస్తూ ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవిలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపియం(ఎఫ్ఐ) నీలిమ, ఎపియం విక్రమ్ రెడ్డి, మెండోర బ్రాంచ్ మేనేజర్ క్రాంతి కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభంజనం సృష్టించిన లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు

- వరుసగా ఎనిమిది సంవత్సరాలుగా వందశాతం ఉత్తీర్ణత
- ఏ గ్రేడ్ ఉత్తీర్ణత సాధించిన 14 మంది విద్యార్థులు

నవతెలంగాణ-మెండోర

మండలంలోని పోచంపాడ్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు. 2008వ సంవత్సరం నుండి వరుసగా వందశాతం ఉత్తీర్ణత సాధిస్తూ పాఠశాల పేరును ఉన్నతంగా నిలబెడుతున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో సైతం వందశాతం ఉత్తీర్ణత సాధించి 14 మంది విద్యార్థులు "ఎ" గ్రేడ్, ఒక్కరు "బి" గ్రేడ్ ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులను కరస్పాండెంట్ సత్యనారాయణ అభినందించారు. 16 సంవత్సరాలుగా పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధిస్తూ 9 జిపిఏ పైన అధిక విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అత్యక్రియలు చేస్తున్న ఇందూరు యువత సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నాలుగు రోజుల క్రితం ఆనారోగ్యంతో చనిపోయిన అనాధ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ శ్మశాన వాటికలో నాలుగో ఠాణా ఎస్.ఐ సందీప్ అనుమతితో అంతక్రియలను శుక్రవారం నిర్వహించారు. డదెబ్బతో రోడ్డుపై పడి ఉండగా వారం రోజుల క్రితం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 4వ ఠాణా పోలీస్ సిబ్బంది తరలించారు. పూర్తిగా ఆనారోగ్యం క్షీణించడంతో నాలుగు రోజుల క్రితం మరణించడంతో అంతక్రియలను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు ఈ.సి మెంబర్ కాసుల సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ జేఏసీ నాయకులను కలిసిన తెలంగాణ బీజేపీ ఎన్నారై సెల్ కన్వీనర్

నవతెలంగాణ-ఏర్గట్ల

గల్ఫ్ జేఏసీ నాయకులు శివన్నోళ్ళ రాజును తెలంగాణ బీజేపీ ఎన్నారై సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ నరేంద్ర పన్నీర్ ఏర్గట్లలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గల్ఫ్ జేఏసీ నాయకులు రాజుతో బీజేపీ ఎన్నారై సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ నరేంద్ర రానున్న ఎన్నికల్లో గల్ఫ్ కార్మికులు పోటీచేసే స్థానాలు, వ్యూహాలు, కార్మికుల సాధక బాధకాల గురించి చర్చించారు. అనంతరం ఎండలకేంద్రానికి చెందిన గల్ఫ్ కార్మికులు నాయుడు నడిపి పోశెట్టి, అంజి, గంగేశ్వర్, మారుతి, కట్ట నవీన్, నరేంద్ర పన్నీర్‌ను శాలువాతో సన్మానించారు.

రాష్ట్ర కార్యదర్శిగా చిట్టి పటేల్ నియామకం

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు డెవలప్ మెంట్ ఫోరమ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు డెవలప్ మెంట్ ఫోరం అధ్యక్షులు ఎడ్ల రవి కూమార్ పటేల్ (హైకోర్టు న్యాయవాది) తెలిపారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన పిప్పెర చిట్టి పటేల్‌ను రాష్ట్ర మున్నూరు కాపు డెవలప్ మెంట్ ఫోరమ్ కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. చిట్టి పటేల్ గతంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సేవలను అందించారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పదవి ఇవ్వడం జరిగిందని అన్నారు. మరింత రెట్టింపు ఉత్సాహంతో మున్నూరు కాపు హక్కుల సాధనకు కృషి చేస్తానని, ఈ సందర్భంగా తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పజెప్పడంతో ఎడ్ల రవి కూమార్ పటేల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే జిల్లా కమిటీ, మండల కమిటీలు నిర్వహించడం జరుగుతుందని చిట్టి పటేల్ తెలిపారు. ఎంపికైన సందర్భంగా రాష్ట్ర మంత్రి వర్యులు ప్రశాంత్ రెడ్డిని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్క మల్లుబాయి-గంగాధర్, సోషల్ మీడియా వారియర్ బద్రి నరేష్, లక్ష్మణ్ యాదవ్, జిల్లా, మండల మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు..



చిట్టిపటేల్‌ను సన్మానిస్తున్న మంత్రి

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి శుక్రవారం పార్టీ తరపున ఆర్థికసాయం అందించారు. ఆలూరు మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బేగరి రాజు ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించాడు. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా పార్టీ నుంచి రెండు లక్షల రూపాయల చెక్కు వచ్చింది. ఈ చెక్కును రాజు కుటుంబసభ్యులకు జీవన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. అధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

కాంప్లెక్స్ పనులను పరిశీలించిన జీవన్ రెడ్డి...

మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కాంప్లెక్స్ పనులను పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పలిశీలించారు. ఈ సందర్భంగానిర్మాణం కోసం మంజూరు చేసిన 15 లక్షల రూపాయల ప్రొసీడింగ్ పత్రాలను జీవన్‌రెడ్డి, స్థానికులు, నాయకులకు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులను అభినందించిన కాంతి పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కాంతి హైస్కూల్ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ టాపర్ అయిన బిందు శ్రీ (9.7) రాజేష్(9.5) జీపీఏ సాధించారు. విద్యార్థులను కాంతి స్కూల్ ఫౌండర్, కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి శుక్రవారం అభినందించారు. ఈ సంద ర్భంగా ఫలితాలకోసం కృషి చేసిన విద్యార్థులను అభినందించారు. ప్రోత్సా హం అంది ంచి న తల్లిదండ్రులకు, నిర్విరామంగా శ్రమించిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. కరోనా తర్వాత జరిగిన మొట్టమొదటి పూర్తిస్థాయి పరీక్షల్లో తోడ్పాటు అందించిన అందించిన శ్రేయోభిలాషులకు, మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.





ఆడపిల్లల హక్కులపై దృష్టి పెట్టాలి

- ఎంపీపీ, ఎంపీఓ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఆడపిల్లల హక్కుల పైన దృష్టి పెట్టాలని ఎంపిపి అనూష ప్రేమ్ నాయక్, ఎంపీఓ మధురమ అన్నారు. మండల కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 18 సంవత్సరాలలోపు ఆడపిల్లల హక్కులు, చదువుపై దృష్టి పెట్టాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని వివరించారు. ర్యక్రమంలో పోలీస్ శాఖ, చైల్డ్ సర్వే సంరక్షణ అధికారులు, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, ఎస్టీ సెల్ అధ్యక్షులు భానోత్ గోపాల్ నాయక్, సర్పంచులు నగేష్, రామ్ గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

రెజ్లింగ్ క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే బాధ్యతల నుండి తొలగించి, చట్టరిత్యా కఠినంగా శిక్షించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ... భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులుగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై గతంలోనే అనేక కేసులు, ఫిర్యాదులు ఉన్నాయన్నారు. క్రీడాకారులపై బహిరంగంగానే వివాదాస్పదంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బ్రిజ్ భూషణ్‌ను వెనుకేసుకుని రావడం ఫలితంగానే మహిళా క్రీడాకారులపై ఆయన ఆగడాలు మరింత తీవ్రమయ్యాయన్నారు. ఒలంపిక్స్, ప్రపంచ కప్ మొదలగు పోటీల్లో భారతదేశానికి పథకాలు తీసుకొచ్చినప్పుడు గొప్పగా చెప్పుకొని, క్రీడాకారులతో ఫోటోలు దిగిన ప్రధాని, క్రీడా మంత్రులు ఇప్పుడు మొహం చాటేయడం అనైతికమన్నారు. మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను తక్షణమే సమాఖ్య బాధ్యతల నుంచి తొలగించాలని, చట్టరిత్యా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి వి. ప్రభాకర్ మాట్లాడుతూ... ఒకవైపు బేటి పడావో, బేటి బచావో అని చెప్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, మహిళా క్రీడాకారులు దేశ రాజధానిలో ఇన్ని రోజులుగా నిరసన చేస్తుంటే వారితో మాట్లాడడం గాని, మంత్రుల ద్వారా చర్చించడం గాని చేయకపోవడం దుర్మార్గమన్నారు. భారత ప్రధాని వైఖరి రేపిస్టులను, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కాపాడే విధంగా ఉండటం విచారకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం బోధన్ డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్ జిల్లా నాయకులు ఎం. నరేందర్, ఎస్.సురేష్, పి.రామకృష్ణ, ఎం.సుధాకర్, సీహెచ్. సాయగౌడ్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు కిషన్, పిడిఎస్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.నరేందర్ కే.గణేష్, నగర అధ్యక్షులు ఎస్.కే అఫ్జర్, ఐఎఫ్టియు నాయకులు జిల్లా మురళి, సాయిరెడ్డి, గంగాధర్, ఏఐకెఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

16న కామ్రేడ్ మారోజు వీరన్న 23వ వర్ధంతి

- సభను జయప్రదం చేయండి
- బహుజన లెఫ్ట్ పార్టీ బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
- దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సామాజిక న్యాయ సాధన కోసం ఉద్యమించిన కులవర్గ సైద్ధాంతిక యోధుడు కామ్రేడ్ మారోజు వీరన్న 23వ వర్ధంతి సభను మే 16న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పీ కార్యాలయంలో బహుజన కమ్యూనిస్టు పార్టీ నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి డి.మల్లిఖార్జున్, బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పీ జిల్లా కన్వీనర్ కె.మధులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు బహుజన ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. కామ్రేడ్ వీరన్న సంవత్సరాల కమ్యూనిస్టు ఉద్యమం కేవలం ఆర్థిక పోరాటాలు చేసి కుల నిర్మూలన పోరాటాలు చేయని కారణంగానే కుల వ్యవస్థ, మతోన్మాదం బలోపేతం అవుతుందన్నారు. 23 సంవత్సరాల క్రితం కామ్రేడ్ మారోజు వీరన్న ప్రతిపాదించిన సామాజిక న్యాయం గురించి అన్ని కమ్యూనిస్టు పార్టీల నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాట్లాడుతున్నాయని అన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫూలే, అంబేద్కర్, కమ్యూనిస్టుల సమైక్య ఉద్యమమే కామ్రేడ్ మారోజు వీరన్నకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పీ నగర కన్వీనర్ హైమద్ హుస్సేన్, కె.రాజు, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకులు సిద్ధిరాములు, నతానియల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఆర్టీసీ చైర్మన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం సాయంత్రం అందజేశారు. మండలంలోని పడకల్, అర్గుల్, జక్రాన్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్, ఐసీడీఎంఎస్ చైర్మన్ సంబారి మోహన్, ఎంపీపీ కుంచాల విమల రాజు, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ గంగారెడ్డి, మండల కోఆప్షన్‌మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.